
తెగుళ్లతో చీనీ రైతుల కుదేలు

ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు కరువేసగారి కాటమయ్య. తాడిమర్రికి చెందిన ఈయన తనకున్న 16 ఎకరాల్లో 2000 చీనీ చెట్లు సాగు చేశాడు. చీనీచెట్లకు పులుసు పురుగు ఆశించడంతో ఉన్న ఫలంగా చెట్లు ఎండిపోతున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకపోయింది. తెగులుతో ఎండిపోతున్న చెట్ల కాయలు కోసుకుని 6 టన్నులు తీసుకుని అనంతపురం మార్కెట్‌కు తీసుకెళ్లగా కేవలం రూ.6,750 మాత్రమే వచ్చింది. అది కూడా కూలీ, రవాణా ఖర్చులకే సరిపోయింది.



తాడిమర్రికి చెందిన ఓ పెద్దరైతు తనకున్న 35 ఎకరాల్లో నాలుగు వేల చీనీచెట్లు సాగు చేశాడు. ప్రస్తుతం చీనీతోట కాయలతో నిండుగా ఉంది. ఆయన కూడా మరో రెండు నెలల్లో కోత కోయాలని భావించాడు. ఇంతలో పులుసు పురుగు తోటకు సోకి ఉన్న ఫలంగా చెట్లు ఎండిపోతున్నాయి. దీంతో రైతు తెగులు నివారణ కోసం ఎవరు చెబితే వారి సూచనల ప్రకారం మందులు పిచికారీ చేశాడు. అయినా ఫలితం కనిపించడం లేదు. మందు పిచికారీ చేసిన ప్రతిసారి సుమారు రూ.50 వేలకు పైగా ఖర్చు చేస్తున్నాడు. ఇప్పటి వరకు సుమారు రూ.15 లక్షల దాకా ఖర్చులు వచ్చాయని వాపోతున్నాడు.



తాడిమర్రి వద్ద తెగులు సోకిన చీనీతోటకు మందు పిచికారీ చేస్తున్న దృశ్యం



పులుసు తెగులు సోకడంతో ఎండిపోయిన చీనీచెట్టు

నిట్టనిలువునా ఎండుతున్న చెట్లు..

కొంత కాలంగా పులుసు పురుగు, ఎండు కుళ్లు, వేరుకుళ్లు, నల్లి తదితర తెగుళ్ల సోకి ఉన్న ఫలంగా చీనీచెట్లు ఎండిపోతున్నాయి. దీంతో చెట్లు వాడు పట్టి ఎండిపోవడమే కాక కాయలు మెత్తబడి రాలిపోతున్నాయి. సాధారణంగా చీనీతోటలు ఏడాదికి రెండు కాపులు వస్తాయి. ప్రస్తుతం తోటలు కాపు దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో చెట్లకు తెగుళ్ల సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తెగుళ్ల నివారణ కోసం అన్ని రకాల మందులు పిచికారీ చేస్తున్నారు. అయినా అదుపులోకి రావడం లేదు. కేవలం మందుల కోసమే ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.6 వేల దాకా ఖర్చు చేసున్నట్లు రైతులు చెబుతున్నారు. ఉద్యాన అధికారులు పొలాలను సందర్శించి తెగుళ్ల నివారణకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

- తోటలను కమ్మేసిన పొలుసు పురుగు, ఎండుకుళ్లు, వేరుకుళ్లు
- చెట్లు ఎండిపోయి రాలుతున్న కాయలు
- ఆందోళన చెందుతున్న రైతులు

తాడిమర్రి: తెగుళ్లతో చీనీ రైతులు కుదేలవుతున్నారు. తెగుళ్ల కారణంగా చెట్లు నిట్టనిలువునా ఎండిపోతున్నాయి. నివారణకు ఎన్ని ముందులు వాడినా ఫలితం లేకుండా పోతోంది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ధర్మవరం నియోజకవర్గవ్యాప్తంగా 22,610 ఎకరాల్లో రైతులు చీనీచెట్లు సాగు చేశారు. ధర్మవరం మండలంలో 4,460 ఎకరాలు, బత్తలపల్లి 5,170, ముదిగుబ్బ 4,400, తాడిమర్రి మండలంలో 8,580 ఎకరాల్లో చీనీతోటలు సాగయ్యాయి. అనంతపురం, బెంగళూరు, హైదరాబాదు, చెన్నై, నాగపూర్ తదితర నగరాల్లో వీటికి అధిక గిరాకీ ఉండటం రైతులు చీనీతోటలు అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. మార్కెట్‌లో ప్రస్తుతం చీనీ పంట టన్ను రూ.28 వేల నుంచి రూ.30 వేల దాకా పలుకుతోంది.

ఎన్ని మందులు వాడినా ప్రయోజనం లేదు



చీనీతోటలో పులుసు పురుగు ఉధృతంగా ఉంది. దీంతో చెట్లు వాడు పట్టడంతో పాటు కొమ్మల తాట పెచ్చులు, పెచ్చులుగా ఊడిపోతోంది. అంతేకాక చెట్లు వాడుపట్టి కాయలు మెత్తబడి రాలి పోతున్నాయి. తెగులు నివారణ కోసం ఏమి చేయాలో అంతుచిక్కడం లేదు.

–బొమ్మక ఆదినారాయణరెడ్డి, మద్దులచెర్వు, తాడిమర్రి

తొలిదశలోనే నివారణ చర్యలు చేపట్టాలి



చీనీతోటల సాగు రైతులు చీనీచెట్లను ఆశించే తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. తొలి దశలోనే తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి. అధికారుల సూచనలు, సలహాలను పాటించి మందులను పిచికారీ చేసుకుంటే తెగుళ్లను పూర్తిగా నివారించుకోవచ్చు.

–అమరేశ్వరి, ఉద్యానవన అధికారి, ధర్మవరం

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్



రహదారి భద్రతపై డ్రైవర్లతో ప్రమాణం చేయిస్తున్న దృశ్యం



కూడలిలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ సోమశేఖర్

బత్తలపల్లి: ధర్మవరం సబ్‌డివిజన్‌లో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు డీఎస్పీ హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై తమ సిబ్బందితో సమీక్షిస్తున్నామన్నారు. దాతల సహకారంతో సబ్ డివిజన్ పరిధిలోని ప్రతి పోలీస్ స్టేషన్, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆటోలు, ప్రవేట్ వాహనాలు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా క్రమపద్ధతిలో వెళ్లేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పత్రికలు అసాంఘిక కార్యకలాపాలు, ఇతరత్రా సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే తగు చర్యలు చేపడతామన్నారు. అంతకు ముందు స్థానిక శ్రీలలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వర ఆలయాన్ని సందర్శించారు. ఎస్‌ఐ సోమశేఖర్, ఏఎస్‌ఐలు సోమశేఖర్‌మూర్తి, తిరుపాలు, విజయ్‌కుమార్, రమేష్ ఉన్నారు.

బత్తలపల్లి: వాహనదారులు రోడ్డు నియమాలను పాటింకుంటే చర్యలు తప్పవని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం జాతీయ రహదారితోపాటు బత్తలపల్లి కూడలిలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు భద్రత మన అందరి బాధ్యతన్నారు. వాహనదారులు వాహన రికార్డులను తమ వద్దే ఉంచుకోవాలన్నారు. ఏఎస్‌ఐలు సోమశేఖర్‌మూర్తి, తిరుపాలు, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లమాడ: వాహనదారులు రహదారి నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా గురువారం స్థానిక పాత బాలాజీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ఆవరణలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఎంవీఐ డీఎస్‌ఎం వరప్రసాద్, నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి, ఏఎంవీఐ రాజేష్ రోడ్డు మాట్లాడారు. తల్లిదండ్రులు చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. అనంతరం వైఎస్సార్ కూడలి వద్ద రహదారి భద్రతపై ప్రమాణం చేయించారు. పాఠశాల కరెస్పాండెంట్ పోలే స్వర్ణలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాంధీజీ అడుగుజాడల్లో నడుద్దాం



తలుపులలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తలుపుల: జాతిపిత మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడుద్దామని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా స్థానిక మూడు రోడ్ల కూడలి వద్ద గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజా సంఘాల నాయకులు ఎద్దుల రాముడు, కేశవరెడ్డి, కిట్టు, అంజి, రాజశేఖర్, కుళ్లాయప్ప, బాదుల్లా, హమాలీలు పాల్గొన్నారు.

తాడిమర్రి: స్థానిక గ్రంథాలయంలో గాంధీజీ వర్ధంతి సందర్భంగా గ్రంథాలయాధికారి శీనానాయక్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీ దేశానికి చేసిన సేవలను గ్రంథాలయాధికారి కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: జగరాజుపల్లిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో గాంధీ వర్ధంతి సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ మునిచంద్రిక, జిల్లా గణాంకాధికారి కళాధర్, డీపీఎంఓ నాగరాజు, ఐడీఎస్‌పీ సుబ్బరావు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. టెలీ మెడిసిన్ సేవలపై సిబ్బంది అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ నగేష్, పీహెచ్ఎన్ లలిత కుమారి, సూపర్‌వైజర్ చంద్రకళ, సిబ్బంది పాల్గొన్నారు.

కనగానపల్లి: స్థానిక గ్రంథాలయంలో గురువారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేపట్టిన అహింసా మార్గం గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి గోవిందు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 8,9 తేదీల్లో రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీ

ధర్మవరం అర్బన్: ఫిబ్రవరి 8,9 తేదీల్లో రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ టోర్నీ నిర్వహించనున్నట్లు హైబ్రో చెస్ అకాడమి ఆర్గనైజింగ్ కార్యదర్శి జాకీర్ హుసేన్, ఆర్గనైజింగ్ అధ్యక్షుడు చాంద్‌బాషా, యువర్స్‌ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర తెలిపారు. గురువారం పట్టణంలోని స్వాతి క్లినిక్‌లో టోర్నీ కరపత్రాలను విడుదల చేశారు. టోర్నీలో ప్రవేశ రుసుం రూ.600 ఉంటుందన్నారు. రెండు రోజులు చెస్ క్రీడాకారులకు ఉచిత భోజనం , వసతి ఏర్పాటు చేస్తామన్నారు. వివరాలకు 9912647370, 08559–221813 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. యువర్స్ ఫౌండేషన్ కార్యదర్శి జయరాం, కోశాధికారి మోహన్, ఉపాధ్యక్షుడు సుంకు సుకుమార్, చార్టెడ్ ప్రెసిడెంట్ పోలా ప్రభాకర్, పీఆర్‌ఓ రాధాకృష్ణ, జాయింట్ కార్యదర్శి రమేష్ బాబు, సభ్యులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఓడీచెరువు: వ్యాపారులు తమ దుకాణాల ముందు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ నరేంద్రరెడ్డి , ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. సీసీ కెమెరాలుంటే చోరీలు, ఇతర నేరాలు జరిగినప్పుడు నిందితులను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందని సీఐ తెలిపారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం

తాడిమర్రి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్న ఈఓఆర్డీ విజయ్‌శేఖర్ నాయుడు, ఎంఈఓ కృష్ణమోహన్, ఉపాధి హామీ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ ఓంప్రకాష్‌రెడ్డిని బీజేపీ ధర్మవరం అసెంబ్లీ కన్వీనర్ జీ.గోపాల్‌రెడ్డి గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరంగరావు, ఏపీఓ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు ఈకేవైసీ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఏఓ లోకేశ్వరరెడ్డి

ఎన్‌పీకుంట: రైతులకు సంబంధించి ఈకేవైసీ గడువులోగా పూర్తి చేయాలని ఏఓ లోకేశ్వరరెడ్డి రైతు సేవా కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గురువారం రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఇప్పటికే 98 శాతం ఈ క్రాప్ నమోదు పూర్తయిందన్నారు. ఫిబ్రవరి 14 లోగా ఈకేవైసి పూర్తి చేయాలని సూచించారు. రైతులకు ఆధార్ తరహాలో ప్రత్యేక కార్డు ఇవ్వడానికి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించిందన్నారు. దీనిపై వీఏఏలు రైతులకు అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. కార్డు ద్వారా రైతులు వ్యవసాయ పథకాలను వినియోగించుకోవచ్చని, కనీస మద్దతు ధరతో పంటలను అమ్ముకోవచ్చని తెలిపారు. అనంతరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్న ఏఓను ఆర్‌ఎస్‌కే సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఈఓ శిరిష, వీఏఏలు, వీహెచ్ఏలు, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

బత్తలపల్లి: సబ్సిడీతో డ్రిప్పు, స్ప్రింక్లర్లు కావాల్సిన రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఏపీఎంఐపీ ఎంఐఏఓ శివశంకర్ పేర్కొన్నారు. గురువారం బత్తలపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డ్రిప్, స్ప్రింక్లర్లు కావాల్సిన రైతులు కేవలం ఆన్‌లైన్ ద్వారానే డీడీలు చెల్లించాలన్నారు. ఫోన్ పే, గూగుల్ పే, నెఫ్ట్ ఆర్‌టీజీఎస్, నెట్ బ్యాంకింగ్ ద్వారానైనా డీడీలు కట్టుకోవచ్చన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నగదు రూపంలో ఎవ్వరికి కూడా డబ్బు చెల్లించొద్దన్నారు. ఇటీవల ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొంత మంది తాము కంపెనీ డీలర్స్, ఉద్యోగులమని డబ్బు కట్టించుకొని మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలిపారు. డ్రిప్పు, స్ప్రింక్లర్లు కావాల్సిన రైతులు దగ్గరలోని రైతు సేవ కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను కలిసి పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

సంక్షిప్త సమాచారం

నగదు ఆన్‌లైన్‌లో చెల్లించాలి

చెన్నేకొత్తపల్లి: సూక్ష్మనీటి పరికరాలు కావాల్సిన రైతులు సబ్సిడీ ధర పోను మిగిలిన మొత్తాన్ని ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుందని ఎంఐఏఓ రవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా రైతుల వద్దకు వచ్చి డ్రిప్పులు, స్ప్రింక్లర్లను త్వరగా ఇస్తామని చెబితే మోసపోవద్దని సూచించారు. మరింత సమాచారం తెలుసుకునేందుకు చెన్నేకొత్తపల్లిలోని తమ కార్యాలయానికి రావాలన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

ధర్మవరం: దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి డీ.ఓబులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అలాగే ఆయన ల్యాబ్ టెక్నీషియన్ నిర్వహించే అన్ని రకాల రిజిస్టర్లను పరిశీలించారు. సబ్ డివిజన్ యూనిట్ ఆఫీసర్ జయరామ్ నాయక్ ఉన్నారు.

నిందితుడి అరెస్టు

కదిరి టౌన్: గొడవ కేసులో పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. గతేడాది జూలై 3న పట్టణంలోని టవర్‌క్లాక్ వద్ద గాండ్లపెంట మండలం ఎలుగూటివారిపల్లికి చెందిన సూర్యశేఖర్‌కు కొలేపల్లి మెగా అంజాద్‌ఖాన్ గొడవ జరిగిందన్నారు. సూర్యశేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు అప్పట్లోనే అంజాద్‌ఖాన్‌పై కేసు నమోదు చేశామన్నారు. గురువారం నిందితుడిని అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

తాడిమర్రి: సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకట రంగారావు గురువారం తెలిపారు. బీసీ, ఈబీసీ నిరుద్యోగ యువతీ, యువకులు రూ.4 లక్షల సబ్సిడీతో రూ.8 లక్షల రుణం అందించే జనరిక్ మెడికల్ షాపు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులు వచ్చే నెల 7లోపు ఆయా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

కదిరి అర్బన్: మండలంలోని బీసీ, ఈబీసీ(కమ్మ, రెడ్డి ,కాపు, బ్రాహ్మణ కులస్తులు) యువతీ యువకులు సబ్సిడీ రుణాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ పోలప్ప గురువారం తెలిపారు. కదిరి మండలానికి మొత్తం 43 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. వివరాలకు ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బత్తలపల్లి: బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ నరసింహనాయుడు గురువారం తెలిపారు. 2024–25కు సంబంధించిన బీసీ కార్పొరేషన్ ఇచ్చే సబ్సిడీ రుణాల కోసం బీసీలు, ఈబీసీలు వచ్చే నెల 7 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సచివాలయాల్లో ఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

తాడిమర్రి: రైతులు చీనీచెట్లకు సోకే తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఉద్యానవన అధికారి అమరేశ్వరి సూచించారు. శివంపల్లిలో గురువారం ఆమె చీనీ రైతులకు తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. పులుసు పురుగు నివారణ కోసం మొదటగా ఏదైనా ఒక షాంపూ 5 మిల్లీలు లీటర్ నీటికి కలిపి చెట్టు బాగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. మరుసటి రోజున ఫిప్రానిల్ రెండు మిల్లీలు, వేపనూనె కలిపి 50,000 పీపీఎస్ 2 మిల్లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

క్లుప్తంగా

కుష్టు నిర్మూలనకు కృషి చేద్దాం



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఎన్‌పీకుంట: కుష్టు నిర్మూలనకు కృషి చేద్దామని సీహెచ్‌ఓ నాగలక్ష్మి సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కుష్టు సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. తద్వారా బాధితులకు త్వరగా వైద్య మంది కోలుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈసందర్భంగా కుష్టు నివారణకు కృషి చేస్తామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. పీహెచ్ఎన్ శాంతమ్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

తనకల్లు: గంగసానిపల్లి వద్ద ఉన్న జాతీయ రహదారి–42పై బుధవారం రాత్రి బైక్ అదుపు తప్పడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. కదిరికి చెందిన భరత్‌కుమార్ అన్నమయ్య జిల్లా మొలకలచెరువు వైపు తన బైక్‌పై బయలుదేరాడు. అయితే గ్రామం సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పడంతో రోడ్డుపై పడ్డాడు. అతడి ముఖానికి బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వందేమాతరం టీం సభ్యులు తమ ఉచిత అంబులెన్స్‌లో క్షతగాత్రున్ని తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. తర్వాత అక్కడి వైద్యుల సూచన మేరకు కదిరికి తరలించారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ విజయ్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: విద్యార్థినులకు గుడ్ టచ్–బ్యాడ్ టచ్ పై అవగాహన ఉండాలని పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తచెరువులోని చైతన్య పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాలు ఎవరైనా వినియోగిస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పోక్సో యాక్ట్, పిల్లల భద్రత, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, డయల్–100 తదితర వాటి గురించి వివరించారు. సీఐ ఇందిర, ఉపాధ్యాయులు ఉన్నారు.

క్షయపై అవగాహన అవసరం



క్షయపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పుట్టపర్తి: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని బుక్కపట్నం హెల్త్ సూపర్‌వైజర్ రామ్మోహన్‌చౌదరి పేర్కొన్నారు. గురువారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని బుచ్చయ్యగారిపల్లిలో హెచ్ఎం వరదానాయుడు, ఆరోగ్య సిబ్బందితో కలిసి క్షయపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ క్షయపై నిర్లక్ష్యం వహించొద్దన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది హబీబ్ బాషా, మురళి, శిరీష, అరుణ, సుధారాణి పాల్గొన్నారు.

బాలికల వసతిగృహం తనిఖీ



విద్యార్థినులతో మాట్లడుతున్న ఆర్‌డీఓ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బీసీ కళాశాల వసతి గృహాన్ని గురువారం ఆర్డీఓ మహేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని వసతులు, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఎలాంటి సమస్యలున్నా తనకు తెలియజేయాలని ఆర్డీఓ విద్యార్థినులకు సూచించారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



బ్యాంకును ప్రారంభిస్తున్న జీఎం మితంతయ్య

ముదిగుబ్బ: కెనరాబ్యాంక్‌లో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామని బ్యాంక్ జనరల్ మేనేజర్ ఐ.పాండురంగ మితంతయ్య పేర్కొన్నారు. కెనరాబ్యాంక్ ముదిగుబ్బ శాఖను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల వారికి విరివిగా రుణాలు అందించించి ప్రోత్సహిస్తామన్నారు. బ్యాంకు ఏజీఎం మురళీమోహన్, బ్రాంచి మేనేజర్ లక్ష్మీనరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థల బంద్



విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిస్తున్న ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

కదిరి అర్బన్: ఇంటర్ విద్యార్థి చరణ్ మృతి కారణమైన అనంతపురంలోని నారాయణ కాలేజీని సీజ్ చేయాలంటూ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఐక్య విద్యార్థి సంఘం నాయకులు తెలిపారు. గురువారం కదిరిలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషం మహేంద్ర, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబ్జాన్ విలేకరులతో మాట్లాడారు. చరణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపి, అందుకు బాధ్యులైన నారాయణ కళాశాలను సీజ్ చేయడంతోపాటు నారాయణను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఎద్దు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎద్దు

తనకల్లు: స్థానిక గంగమ్మగుడి వద్ద జాతీయ రహదారి–42పై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఎద్దు మృతి చెందగా, వెంకటరమణ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలు... ఇందిరానగర్‌కు చెందిన వెంకటరమణ తన భార్యతో కలిసి ఎద్దుల బండిపై తన పొలం వద్దకు బయలుదేరాడు. అయితే గంగమ్మ గుడి వద్దకు రాగానే వెనక నుంచి బొలెరో వాహనం వేగంగా వచ్చి ఎద్దుల బండిని ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఒక ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్‌ఐ గోపి ఘటన ఘటనాస్థలికి చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. కాగా తనకు జీవనాధారమైన ఎద్దును రోడ్డు ప్రమాదంలో కోల్పోయానని, ఇక కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలంటూ రైతు కుటుంబం బోరున విలపించిన తీరు చూపరులను కలచివేసింది

విద్యుదాఘాతంతో ఆవు..

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం రామసాగరంలో ఓ ఆవు నీటి కోసం వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గురువారం గ్రామానికి చెందిన రైతు రవి ఆవు నీటి కోసం సమీపంలోని చెరువులోకి వెళ్లింది. చెరువు గట్టు సమీపంలో విద్యుత్ వైరును తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే ఆవు మృతి చెందింది. సుమారు.30 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం



అధికారులతో వాగ్వాదానికి దిగిన కౌన్సిలర్లు

కదిరి టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా అధ్యక్షతన జరిగిన సమావేశం రసాభాసగా మారింది. ముందుగా అధికారులు 2025–26 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. దీంతో కౌన్సిలర్లు అధికారుల తీరుపై మండిపడ్డారు. తమ అభిప్రాయాలు తెలుసుకోకుండా బడ్జెట్ ఎలా ప్రవేశపెడతారని అధికారులతో వాగ్వాదానికి దిగారు. స్పందించిన మున్సిపల్ చైర్‌పర్సన్ మెజార్టీ కౌన్సిలర్ల కోరిక మేరకు బడ్జెట్‌ను వాయిదా వేయాలని అధికారులను ఆదేశించారు. అజెండాలోని కొన్ని అంశాలపై కౌన్సిలర్లు అభ్యంతరం తెలియజేశారు. తమ వార్డుల్లో సమస్యలను అధికారులు పరిష్కరించడంలేదని, ఇంక తాము ఎందుకు కౌన్సిలర్లుగా ఉండాలని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమీషనర్ కిరణ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగాదేవి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మాఘమాస పూజలు ప్రారంభం

బత్తలపల్లి: మండలవ్యాప్తంగా గురువారం మాఘమాస పూజలు ప్రారంభమయ్యాయి. బత్తలపల్లిలోని లక్ష్మీవెంకటేశ్వరుడు, శ్రీలలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వర బాలయంలో శివాదీక్షాపరులు పూజలు నిర్వహించారు. పోట్లమర్రి, ముష్టూరు శివాలయంలు, గంటాపురం అప్పస్వామి, దంపెట్ల చెన్నకేశవాలయం, కోడేకండ్ల వీరనారాయణస్వామి దేవాలయాలు, సంజీవపురం కాటికోటేశ్వర క్షేత్రం, సంఘమేశ్వర క్షేత్రంలో మహిళలు మాఘస్నానాలనంతరం ప్రత్యేక పూజలు చేపట్టారు.